# సూర్య

18వ వసంతంలోకి

www.suryaa.com

## నల్గొండ-యాదాద్రి-సూర్యాపేట

శుక్రవారం 17, జనవరి 2025 పేజీలు - 8


# ఆలయంలో విశేష పూజలు



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట పుణ్య క్షేత్రంలో గురువారం నిత్య ఆరాధనలు శాస్త్ర యుక్తంగా సాగాయి. హరిహరులను ఆరాధిస్తూ మొక్కులు చేపట్టారు. వేకువజామున సుప్రభాతం చేసి అర్చకులు హారతి నివేదించారు. ఉత్సవమూర్తులకు అభిషేకించి అర్పిం చారు. వేదమంత్రాలతో ఆలయంలో సుదర్శన నారసింహ హెూమం చేపట్టారు. విశ్వక్సేన ఆరాధనతో నారసింహ కళ్యాణం చేశారు. చరమూర్తుల మంది రంలో రామ లింగేశ్వర స్వామిని కొలుస్తూ అభిషేకం చేశారు. పాత గుట్టలో నిత్యారాధనలు కల్యాణోత్సవ పర్వాలు జరిగాయి.

# వచ్చేనెల 2న చెరువుగట్టు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి





*నల్గొండ జిల్లా బ్యూరో*

నార్కెట్‌పల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె చెరువు గట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఛాంబర్‌లో ఈ సంవత్సరం నిర్వహించనున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల పై నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 2న ప్రారంభమై, ఫిబ్రవరి 9న ముగుస్తాయని, బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 2న నల్గొండ పట్టణ పురవీధుల్లో నగరోత్సవం తో ప్రారంభమవుతాయని, ఫిబ్రవరి 4న స్వామి వారి కళ్యాణ మహెూత్సవం, 5న స్వామి వారి శేష వాహన సేవ, ఫిబ్రవరి 6న స్వామి వారి అగ్నిగుండాలు, 7న దీపోత్సవ సేవ, శేష వాహన సేవ, 8న మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం 9న గ్రామోత్సవం ఉంటాయని వివరించారు. శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు మిగతా 2లో

# పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

### - కలెక్టర్ హనుమంతరావు



భువనగిరి, మేజర్‌న్యూస్ : ప్రతి నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు పని చేస్తున్నారని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం ఆత్మకూర్ మండలంలోని రాయిపల్లి గ్రామంలో నిర్వహిస్తోన్న నాలుగు సంక్షేమ పథకాల (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు(రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్లు) సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ హనుమంత రావు సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సర్వే తీరుని పరిశీలిస్తూ ఇంట్లో ఉన్న సభ్యులతో మాట్లడారు, మీకు ఎన్ని ఎకరాల భూమి ఉందని, ఆ భూమిలో వ్యవసాయం చేస్తున్నారా, వ్యవసాయ యోగ్యమైన భూమి వుందా లేక రాళ్లు రప్పలు ఉన్నాయా అని తదితర వివరాలను సేకరించారు. అలాగే ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోగా, ఆ దరఖాస్తులను ప్రభుత్వం తెలిపిన మార్గదర్శకాలకు అనుగుణంగా మిగతా 2లో

# కష్టం మిల్లింగ్ రైస్‌ను సకాలంలో చెల్లించని వారి పై చర్యలు

### అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

*నల్గొండ జిల్లా బ్యూరో*

కష్టం మిల్లింగ్ రైస్ (సిఎంఆర్)ను సకాలంలో చెల్లించడంలో వైఫల్యం చెందిన మిల్లర్లపై చర్యలు తీసుకోవడమే కాకుండా, అలాంటి మిల్లులను బ్లాక్ లిస్టులో ఉంచడం జరుగుతుందని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. గురువారం అయన తన చాంబరాలి రైస్ మిల్లర్లతో 2024-25 ఖరీఫ్, రబీ సీఎంఆర్ పై సమీక్షించారు. రబీ సీఎంఆర్‌ను ఈనెల 25 లోగా నూటికి నూరు శాతం చెల్లించాలని చెప్పారు. మిల్లర్లకు రబీలో 3 లక్షల 26 వేల 99 మెట్రిక్ టన్నులు ఇవ్వడం జరిగిందని, ఇందుకుగాను మిల్లర్లు 2 లక్షల 21 వేల 747 మెట్రిక్ టన్నుల సి ఎం ఆర్ చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు 2 లక్షల 1892 మెట్రిక్ టన్నులు మాత్రమే మిగతా 2లో



# వ్యవసాయ యోగ్యం కాని భూముల పరిశీలన పక్కాగా చేయాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




*నల్గొండ జిల్లా బ్యూరో*

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా పథకం కింద వ్యవసాయ యోగ్యం కాని భూముల పరిశీలనను పక్కగా చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వ్యవసాయ, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, వెలిమినేడులో వ్యవసాయ, రెవెన్యూ అధికారుల బృందాలు నిర్వహిస్తున్న రైతు భరోసా క్షేత్రస్థాయి పరిశీలనను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా పథకం కింద భూభారతి ద్వారా డౌన్లోడ్ చేసుకున్న భూముల వివరాలు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాటిస్తున్న నియమ, నిబంధనలను ఆమె వ్యవసాయ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంతేకాక భూభారతిలోని జాబితా ద్వారా వెలిమినేడు గ్రామంలో గుర్తించిన వ్యవసాయేతర భూములైన నాలా లే-ఔట్లు, ఫ్యాక్టరీలు, ఇండ్లు, మైనింగ్, రాళ్లు రప్పలు, కొండలు, గుట్టలు ఉన్న భూములు, తదితర భూముల వివరాలను నమోదు చేస్తున్నది లేనిది పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఈ బాధ్యత మండల స్థాయిలో వ్యవసాయ, రెవిన్యూ అధికారులపై ఆధారపడి ఉందని, వ్యవసాయ యోగ్యం కానీ భూముల జాబితాను మరో సారి పరిశీలించి పక్కగా జాబితా రూపొందించాలని ఆమె ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిట్యాల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ధరణి పోర్టల్ లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించడమే కాకుండా, కార్యాలయానికి భూ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ధరణిలో పెండింగ్లో ఉన్న అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆమె చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, మండల వ్యవసాయ అధికారి, తహసిల్దార్ కృష్ణ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# వచ్చేనెల 2న చెరువుగట్టు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా శాఖల వారీగా సమీక్షిస్తూ రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో భక్తుల కోసం బ్యారికేడింగ్‌తో క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించే అన్ని రోజులు పూర్తి భద్రత ఏర్పాటు చేయాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని, భక్తులు క్యూలైన్లలో వచ్చి స్వామివారిని దర్శించుకునే విధంగా నియంత్రించాలని, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు రద్దీని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇందుకు ఇన్చార్జి డిఎస్పి బి.రమేష్ స్పందిస్తూ ఈ విడత స్వామి వారి బ్రహ్మోత్సవాల భద్రత కోసం ప్రతిరోజు మూడు విడతలుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకుగాను, 900 మంది పోలీసులు సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, ఎలాంటి పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకుగాను చెరువుగట్టు పరిసర ప్రాంతాలలో ఉన్న అన్ని గ్రామాల నుండి పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బందిని, అలాగే అవసరమైతే నార్కట్‌పల్లి మండలం సిబ్బందిని విధులకు నియమించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. చెరువుగట్టు పైకి వచ్చే పంచాయతీ రోడ్లు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏవైనా మరమ్మతులు ఉంటే చేపట్టాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాగు నీటికి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో తాగునీటిని ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం చెరువుగట్టుపై 33 కెవి జనరేటర్లు రెండు ఉన్నాయని ఆలయ అధికారులు జిల్లా కలెక్టరకు తెలుపగా, సరిపోయినంత విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ బ్రహ్మోత్సవాలు నిర్వహించే రోజులలో రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకోవాలని, అలాగే 33 కెవి జనరేటర్లను సైతం సిద్ధం చేసుకోవాలని విద్యుత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా స్థానిక ఎగ్జిక్యూటివ్ అధికారితో సమన్వయం చేస్తూ చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు క్యూలైన్లలో వెళ్లి స్వామి వారిని దర్శించుకునే విధంగా టికెట్ కౌంటర్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకుగాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో చెరువుగట్టు వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నార్కెట్పల్లి, అక్కనపల్లి పి హెచ్ సి సిబ్బందిని చెరువుగట్టు వద్ద విదులలో నియమించాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో మద్యం నియంత్రించాల్సిందిగా ఎక్సైజ్ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను సక్రమంగా నిర్వహించేందుకు రెవెన్యూ అదనపు కలెక్టర్ ను పరివేక్షణ అధికారిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. అలాగే నల్గొండ ఆర్డీవో బ్రహ్మోత్సవాల ఇన్చార్జి బాధ్యతలను నిర్వహించాలని ఆదేశించారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ ఈ సంవత్సరపు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తమ వంతు సహకారం జిల్లా యంత్రాంగానికి అందిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగినన్ని రోజులు తాను అక్కడే ఉండి పర్యవేక్షిస్తానని చెప్పారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, దేవాలయ అధికారులు బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఆసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం తాగునీరు, విద్యుత్, టికెట్ కౌంటర్లు, బ్యారి కేడింగ్, పోలీస్ భద్రత తదితర అన్ని అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ముఖ్యంగా చెరువుగట్టు కింద ఏర్పాటు చేసే షాపులు రోడ్లపైకి రాకుండా పోలీసు అధికారులు చర్య తీసుకోవాలని కోరారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు జిల్లా కలెక్టర్‌కు, శాసనసభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, ఇంచార్జ్ డి.ఎస్.పి జీ. రమేష్, దేవాదాయ శాఖ కమిషనర్ కే. భాస్కర్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవీన్, జిల్లా అధికారులు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# కష్టం మిల్లింగ్ రైస్‌ను సకాలంలో చెల్లించని వారి పై చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించారని, తక్కిన 19856 మెట్రిక్ టన్నులను ఈనెల 25 లోపు చెల్లించాలని ఆదేశించారు. జిల్లాలో రబి సిఎంఆర్ మొత్తం 91 శాతాన్ని చెల్లించడం జరిగిందని తెలిపారు. 2024-25 ఖరీఫ్ సీఎంఆర్ రైస్ మిల్లర్లు అందరూ నిర్దేశించిన సమయంలోగా చెల్లించాలని ఆయన ఆదేశించారు. సీఎంఆర్ చెల్లింపులో వైఫల్యం చెందిన మిల్లర్లపై చర్యలు తీసుకోవడమే కాకుండా, అలాంటి మిల్లులను బ్లాక్లిస్టులో ఉంచడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశానికి జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు.

# పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేసి లబ్ధిదారులను గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కాకపోతే విడతల వారీగా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందన్నారు. అర్హులెవరూ కూడా ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. అదే విధంగా ఈ సర్వే ప్రక్రియ ఈ నెల 20 వరకు కొనసాగుతుందని, కుటుంబాల సమగ్ర వివరాలను తెలుసుకొని, ఆయా పత్రాలను పరిశీలించి, ఫార్మ్‌లో నమోదు చేయాలని, ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, అయోమయానికి గురికాకుండా తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా పారదర్శకంగా అత్యంత జాగ్రత్తగా నిర్దేశిత గడువు లోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రవికుమార్ ప్రత్యేక అధికారి రాజారావు, ఆయా మండలాల, గ్రామాల ఎంపిడిఓలు, ఎంపీఓలు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్‌లు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల అనాధాశ్రమానికి లక్ష రూపాయల విరాళం అందజేత

## శనగల రాధాకృష్ణ సేవా సంస్థకు లక్ష రూపాయల విరాళం



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడకు సమీపంలోని అశోక్ నగర్‌లో గల స్థానిక శన గల రాధాకృష్ణ మానసిక దివ్యాంగుల అనాధాశ్రమానికి కోదాడ పట్టణానికి చెందిన వీరేపల్లి వెంకట సుబ్బారావు సతీమణి రుక్మిణమ్మ జ్ఞాపకార్థంగా లక్ష రూపాయల విరాళంను కోదాడ లోని వారి నివాసంలో సంస్థ నిర్వాహకులు శనగల జగన్మోహన్ కు అందజేశారు. అమెరికాలో స్థిరపడిన వారి కుమారుడు వీరేపల్లి వెంకటేశ్వర రావు సతీమణి స్మితతో కలిసి కోదాడకు వచ్చిన సందర్భంగా దివ్యాంగుల అనాధాశ్రమాన్ని సందర్శించి అనాధలను మానసిక దివ్యాంగులను చేర దీసి ఆశ్రయం కల్పిస్తున్న నిర్వాహకులు శనగల జగన్మోహన్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు. దివ్యాంగులకు, సంస్థకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో

# ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు

చింతలపాలెం,మేజర్‌న్యూస్ః మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిసినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. కాగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలలో ప్రథమ బహుమతి రూ.2016లతో ఫ్రెండ్స్ యూత్ టీం, ద్వితీయ రూ.1516లతో కమిటీ టీం, తృతీయ బహుమతి రూ.1016లు సీతా మెమోరియల్ స్కూల్ గెలుచుకున్నట్లు వాలీబాల్ పోటీల నిర్వాహక కమిటీ సభ్యులు బడేసాబ్,మామిడి వెంకటేశ్వర్లు తెలియజేశారు.



# ఎన్నికలలో ఇచ్చిన యూత్ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

## డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్

## క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం




మునుగోడు, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల్లో భాగమైన యూత్ డిక్లరేషన్ హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ అయితగోని విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా బుదవారం రాత్రి డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కట్ట వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన క్రీడోత్సవాల బహుమతుల సభకు ఆయన ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక హామీల నెరవేర్చడంలో విఫలం అయిందని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి లాంటి అనేక హామీలు ఇచ్చి మాట తప్పిందన్నారు. నిరుద్యోగులకు వడ్డీ లేని రుణాలను ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల పేరుతోటి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి క్రీడా మైదానాలను పట్టించుకోకుండా వదిలేసిందన్నారు. ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగానే వ్యవహరిస్తుంది అని విమర్శించారు. ప్రభుత్వం యువతను క్రీడల వైపు వెళ్లే విధంగా ప్రోత్సహించాలని కోరారు. గ్రామాల్లో కొన్ని ప్రధానమైన సమస్యల పైన డివైఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని, డివైఎఫ్ఐ చేసే పోరాటాలకు ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, సిఐటియు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, పగిళ్ల మధు, కట్ట ఆంజనేయులు, వనం సంపత్, కుక్కల బాలస్వామి, బొందు అనిల్, ఎనుగుల మచ్చేందర్, బొందు ముత్యాలు, చేకూరి ప్రేమ్ సాగర్, బొందు శివ, జిల్లపల్లి శివ, గోస్కొండ శ్రీకాంత్, బొందు శ్రీను, చేకూరి అరుణ్ సాగర్, కుక్కల కార్తీక్, కుక్కల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా కే బోల్ కరపత్రాల ఆవిష్కరణ

చౌటుప్పల్, మేజర్‌న్యూస్ : అఖిల భారత యువజన కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా కే బోల్ కార్యక్రమం సీజన్ 5కి సంబందించిన కరపత్రాన్ని నల్లగొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి అద్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ప్రస్తుత నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుమ్మాల మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత తమ అభిప్రాయం స్వేచ్ఛగా వ్యక్తికరించానికి అవకాశం కల్పించడం అని తెలిపారు. పౌర బాధ్యతలపై చైతన్యం, నాయకత్వ వికాసం, జాతీయ చర్చలు, సమానత్వం, న్యాయం ఈ కార్యక్రమం ద్వారా యువజన కాంగ్రెస్ దేశంలో యువత సంఘటితం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు వల్కి దిలీప్, తిరుగుడు రవి యాదవ్, జహంగీర్, జాల మణికంఠ స్వామి, మునుగోడు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బనబోయిన రాము యాదవ్, నకిరేకల్ అధ్యక్షుడు ఏనుగు రఘుమా రెడ్డి, దేవరకొండ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, నాగార్జునసాగర్ అధ్యక్షుడు మర్రెడ్డి బాను చందర్ రెడ్డి, నల్లగొండ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా నాగరాజు, జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సంబందించిన వివిధ మండలాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



భువనగిరి, మేజర్‌న్యూస్ : రోడ్డు ప్రమాదంలో తల్లి కూతురు మృతి చెందిన సంఘటన భువనగిరి మండల పరిధిలో రాయగిరి హిందుస్థాన్ పెట్రోల్ బంక్ వద్ద గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకట్రామ్ తండాకు చెందిన భూక్యా సంతోష్ సంక్రాంతి పండుగ ముగించుకొని తన కుటుంబ సభ్యుల తో కలిసి హైదరాబాద్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో ఉదయం సుమారు 06:30 గంటల సమయంలో, రాయగిరి గ్రామ శివారులోని పల్లేరుచలు హొటల్ వద్ద గల హిందుస్థాన్ పెట్రోల్ బంక్ దగ్గరకు రాగ, అదే సమయంలో వారి ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ పెట్రోల్ బంక్‌లోకి వెళ్లే ఉద్దేశ్యంతో ఎటువంటి ఇండికేటర్స్ లేకుండా సడెన్‌గా ఎడమ వైపు తిప్పగా, వెనకాల ఉన్న కార్ సడెన్‌గా కంట్రోల్ అవ్వకపోవటం వలన, లారీ వెనుక భాగంలోకి దూసుకెళ్లటంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యి, కారులోని ముందు సీట్‌లో కూర్చున్న సంతోష్ భార్య అనూష, (28) కూతురు చైత్ర (7)లు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న భూక్యా సంతోష్‌కు, సంతోష్ అక్క భవానికి కుడి భుజంకి, అతని బావ రవికి తలకి, కుడి భుజానికి, కుమార్తె మోక్షకి గాయాలయ్యాయి. భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు, భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్ కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన అనూష, చైత్రల మృతదేహాలను భువనగిరి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ మార్చురికి తరలించినట్లు తెలిపారు. గాయాల పాలైన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 సహాయంతో భువనగిరి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు తెలిపారు.

# పండుగవేళ దొంగల భీబత్సం



సూర్యాపేట, మేజర్‌న్యూస్ ః సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా జరుపుకునేందుకు తమ తమ పుట్టినింటికి వెళ్ళడంతో దొంగలకు అదనుగా మారి గత రెండు రోజులుగా వరుస దొంగతనాలు జరిగినట్లు సమాచారం. పట్టణంలోని సీతారాంపురం, ఇందిరమ్మ కాలనీ ఫెస్ 1 లలో దొంగతనాలు జరిగినట్లు బాధితులు తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని 7వ వార్డు, సీతారాంపురంలోని మేడిగ ఉమ పట్టణంలో నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న తన సోదరుడు కీర్తి వెంకన్న ఇంటికి పండుగకు వెళ్ళగా దొంగలు ఇంట్లోకి చొరబడి సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు బంగారు గొలుసు, రింగు, మకర కుందనాలు, చెవు దిద్దులు, సుమారు 75వేల నగదు అపహరించినట్లు బాధితురాలు మేడిగ ఉమ ఆవేదన వ్యక్తం చేశారు. అట్టి ఇంటి సమీపంలోనే ఒక ఇంట్లో చొరబడి తాళం పగులగొట్టి ఇంట్లో ఎటువంటి నగదు, బంగారం లేకపోవడంతో దొంగలు ఖాళీగా వెళ్లిపోయినట్లు తెలిసింది. దొంగలు ఇప్పటి వరకు పెద్ద పెద్ద ఇండ్లు, కాలనీలలోనే దొంగతనాలు చేస్తారనుకుంటే పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే కాలనీలలో దొంగతనాలకు పాల్పడడంతో కాలనీవాసులు, పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు వెంటనే అట్టి దొంగలను పట్టుకొని బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. దొంగతనాలు జరిగిన తీరు ఒకే విధంగా ఉండడంతో పోలీసులు దొంగతనాలు చేసిన దొంగలు ఒక్కరే అని ఒక నిర్థారణకు వచ్చినట్లు సమాచారం.

# మన్నెం రాములుకు నివాళులు అర్పించిన పిల్లి రామరాజు యాదవ్



నల్గొండ టౌన్, మేజర్ న్యూస్ : నల్లగొండ పట్టణంలోని 8వ వార్డు వాస్తవ్యులు మన్నెం రాములు ఇటీవల గుండె పోటు సమస్యతో మరణించారు. వారి పెద్ద కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన బీజేపీ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్.

# భర్తను చంపిన భార్యల అరెస్టు

## సిఐ జి.రాజశేఖర్



చివ్వెంల, మేజర్‌న్యూస్ ః భర్తను చంపిన కేసులో ఇద్దరు భార్యలను అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ జి రాజశేఖర్ తెలిపారు. గురువారం చివ్వెంల మండల పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సై వి మహేశ్వర్ తో కలిసి ఆయన మాట్లాడారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం తేది. 13.01.2025 బుధవారం రాత్రి చివ్వెంల మండలం గుర్రంతండ నందు రత్నావత్ సైదులు తన ఇద్దరు భార్యలతో కుటుంబ కలహాల కారణముగా అతన్ని ఆరోజు రాత్రి అతని భార్యలు ఇరువురు కలిసి రోకలి బండతో కొట్టి చంపినట్లు ఇద్దరు భార్యలు రమ్య, సుమలతలను ఒప్పుకున్నట్లు వివరించారు. ఈ రోజు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కానిస్టేబుల్ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

# పురుగుల మందు త్రాగి యువకుడు మృతి

## ఎస్సై క్రాంతి కుమార్





తుంగతుర్తి, మేజర్‌న్యూస్ : పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కుమార్ చెప్పిన వివరాల ప్రకారంగా రావులపల్లి గ్రామానికి సంబంధించిన చింతకుంట్ల వెంకన్న(33) తండ్రి దేవయ్య వ్యవసాయం చేయుచు జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం 8 గంటలకు అదే గ్రామంలో తన ఇంటి వద్ద పురుగుల మందు త్రాగి మరణించడం జరిగింది. వ్యవసాయం చేయడం వలన ఏర్పడిన అప్పులతో భార్య భర్తల మధ్య గొడవలు జరగగా భార్య వెలుగు పెల్లి గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లడం జరిగిందని అతని తండ్రి అయిన చింతకుంట్ల దేవయ్య తెలియజేసినట్లు చెప్పినారు. అప్పుల బాధతో, భార్య సంసారానికి రావడం లేదని ఆవేదనతో తన కుమారుడు మరణించినట్లు అతని తండ్రి అయిన చింతకుం ట్ల దేవయ్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై క్రాంతి కుమార్ తెలిపినారు. అతనికి భార్య పిల్లలు గలరు.


# మరియమత తిరునాళ్లు ప్రారంభం



నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : నల్గొండ పట్టణంలోని దేవరకొండ రోడ్‌లో గల మరియ మాత తిరునాళ్ల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నలగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్.

# యూత్‌కి ఇచ్చిన హామీలు వెంటనే నేరవేర్చాలి

## డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్




నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల్లో భాగమైన యూత్ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ అమలు చేయాలని, నిరుద్యోగ భృతి 4000 తక్షణమే అందించాలని, నిరుద్యోగులకు వడ్డీ లేని రుణాలను ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ అయితగోని విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రీడోత్సవాల బహుమతుల ప్రధానోత్సవ సభ డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కట్ట వెంకన్న అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక హామీల నెరవేర్చడంలో విఫలం అయిందని, ముఖ్యంగా యువతకు నిరుద్యోగ భృతి లాంటి అనేక మైనటువంటి హామీలు ఇచ్చి మాట తప్పిందని విమర్శించారు. గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల పేరుతోటి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి క్రీడా మైదానాలను పట్టించుకోకుండా వదిలేసిందని ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగానే వ్యవహరిస్తుంది అని విమర్శించారు, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులను కేటాయించి గ్రామాల్లోని యువతను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు, తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చెప్పినట్టుగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి స్పోర్ట్స్ వైపుకు యువతను వెళ్లే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు, గ్రామాల్లో యువత డ్రగ్స్, గంజాయి, మద్యం అనేక ఆసాంఘిక కార్యక్రమాల వైపు వెళుతున్నారని అలా వెళ్లకుండా ఉండాలంటే ప్రభుత్వం యువతను క్రీడల వైపు వెళ్లే విధంగా ప్రోత్సహించాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందించాలని, కొత్త రేషన్ కార్డులను తక్షణమే ప్రతి పేదవానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు, అంతేకాకుండా ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేక ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే బస్సు సౌకర్యం ఏర్పాటు చేసే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో కొన్ని ప్రధానమైన సమస్యల పైన డివైఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని, డివైఎఫ్ఐ చేసే పోరాటాలకు ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు తెలపాలని కోరారు. యువజన సమస్యల మీద నేను కాకుండా ప్రజా సమస్యల మీద కూడా డివైఎఫ్ఐ పనిచేస్తుందని తెలిపారు, అనంతరం క్రీస్తు శేషులు బొందు చంద్రయ్య-లక్ష్మమ్మ, క్రీస్తుశేషులు ఏనుగుల సురేష్ జ్ఞాపకార్థంగా వారి కుటుంబసభ్యుల సహకారంతో బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, సిఐటియు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, పగిళ్ల మధు, కట్ట ఆంజనేయులు, వనం సంపత్, కుక్కల బాలస్వామి, బొందు అనిల్, ఎనుగుల మచ్చేందర్, బొందు ముత్యాలు, చేకూరి ప్రేమ్ సాగర్, బొందు శివ, జిల్లపల్లి శివ, గోస్కొండ శ్రీకాంత్, బొందు శ్రీను, చేకూరి అరుణ్ సాగర్, కుక్కల కార్తీక్, కుక్కల మహేష్, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన జెల్ల పరమేష్ గౌడ్

రాజపేట, మేజర్‌న్యూస్ : రాజపేట మండలం కాల్వపల్లి గ్రామంలో బుధవారం ఇంజ నవీన్‌కి చెందిన పూరి గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లో సంబంధించిన వస్తువులన్నీ బుగ్గి పాలు కావపోవడంతో విషయం తెలుసుకున్న, సామాజికవేత్త, జెల్ల ఫౌండేషన్ చైర్మన్ పరమేష్ గౌడ్ ఆ కుటుంబ సభ్యులకు తనవంతుగా రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు జెల్ల పరమేష్ గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రణీత డాన్స్ చూశారా...?

## నృత్యంతో అదరగొడుతున్న చిచ్చరపిడుగు



మర్రిగూడ, మేజర్‌న్యూస్ : టాలెంట్ ఎక్కడున్నా ఏ మారుమూల గ్రామంలో వున్న బయట పడటానికి కాస్త సమయం పట్టొచ్చు. ఒకవేళ బాల్యదశలో తన టాలెంట్‌ను గుర్తిస్తే విజయాలు దాసోహం అవుతాయి. బాల్య వయసు నుండి చదువుతో పాటు డాన్స్ చేయడం ఆ పాపకు అలవాటుగా మారిపోయింది. ఎంతలా అంటే డాన్స్ చేయకపోతే ప్రాణం పోతది అనేంతలా మారిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. మండల కేంద్రానికి చెందిన మండల ప్రణీత మర్రిగూడ ఆదర్శ పాఠశాలలో ఏడవ తరగతి విద్యను అభ్యసిస్తుంది. చిన్న వయసు 4వ తరగతి నుండే డ్యాన్స్ పై మక్కువ పెంచుకుంది. సినిమాలో వచ్చే పాటలకు తాను పాదం కదిపి డ్యాన్స్ చేయడం ఆరంభించింది. నచ్చిన మ్యూజిక్ వింటూ ఏకలవ్యుడి లాగా తనకు తానే డాన్స్‌లో మెలికలు నేర్చుకుంటూ వెలుగులోకి రాని బాల్య నృత్యకారీని ప్రణీత స్టోరీ. ఫోక్ డాన్స్, భరతనాట్యం, క్లాసికల్ డాన్స్ చేస్తూ హౌరా అనిపిస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల చదువుతోపాటు సమయం దొరికినప్పుడు ఇంట్లో తన డాన్స్ పెర్ఫార్మెన్స్ చేస్తూ తన ఇన్‌స్టాగ్రామ్ Pranitha_queen_of_danceలో 60 వేల మందికి పైగా ఫాలోవర్స్ నీ సొంతం చేసుకుంది ఈ చిచ్చరపిడుగు ప్రణీత. ముఖ కవళికలో ఎక్స్ప్రెషన్ తో ప్రణీత చూపరులను కనుతిప్పకుండా ఆకట్టుకుంటుంది అనడంలో సందేహం లేదు. నిజంగా ప్రణీత డాన్స్ చూడాలనిపిస్తుంది కదా.! చూస్తే మతిపోవాల్సిందే. ఆరవ తరగతి చదువుతున్నప్పుడు మండల కేంద్రంలో ఉన్న గ్రామ భారతి ఆవాసంలో తాను ఇచ్చిన నృత్య ప్రదర్శనకి అవార్డులను సైతం సొంతం చేసుకుంది. చిన్న వయస్సులోనే కూతురి ట్యాలెంట్ గుర్తించిన ఆమె తల్లిదండ్రులు ప్రణితని ప్రోత్సహించారు. ఏ ఈవెంట్ జరిగిన ఫోక్ డాన్స్‌కి సంబంధించి ప్రదర్శనలు ఇవ్వడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉన్నానని ప్రణీత చెప్పుకొస్తుంది. సాంప్రదాయ జానపదాలతో ఫేమస్ అయిన జాను కొరియోగ్రాఫర్ తనకు ఆదర్శమని అంతలా పేరు తెచ్చుకొని పెద్ద డాన్సర్ అవ్వాలని ప్రణీత సాధన చేస్తుంది. నాంపల్లి మండలం దామెర గ్రామానికి చెందిన మండల రమాదేవి పెద్దులు దంపతుల కుమార్తె. ఆమె తల్లిదండ్రులు 12 సంవత్సరాల క్రితం మర్రిగూడ మండలానికి వచ్చి ప్రణీత బుక్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ప్రణిత గొప్ప డ్యాన్సర్ అవ్వాలని మనం అల్ ది బెస్ట్ చెపుదాం.

# ఎస్సార్ ఎస్పీ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించాలి

## బిఆర్ఎస్ మండల నాయకులు గాడుదుల రజిత లింగరాజు యాదవ్

నూతనకల్, మేజర్‌న్యూస్ : ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గాడుదుల రజిత లింగరాజు యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ 69 డిబిఎం కాలువలో రైతులతో కలిసి బైఠాయించి మాట్లాడారు. గత ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో దొంగ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసి ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రతి సంవత్సరం రెండు కార్లకు సరిపడా సాగునీరు అందించిందని రైతులకు ఏనాడు నీటి సమస్య లేకుండా చేసిందని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని, అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా రుణమాఫీ, రైతు భరోసా, వికలాంగుల, పెన్షన్ దారులకు పెన్షన్ పెంపు వంటి అనేక పథకాల విషయంలోనూ విఫలమైందన్నారు. రానున్నది వేసవికాలం సీజన్ కాబట్టి రైతులకు సాగునీరు చాలా అవసరమని ఇప్పటికైనా అధికారులు, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు స్పందించి రైతుల అవసరాలను గుర్తించి ఎస్సారెస్పీ కాలువ ద్వారా మండల ప్రజలకు సాగునీరు అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు ఇరుగు అంజయ్య, మాజీ వార్డ్ సభ్యులు శీలం నారాయణ, కొమ్మనబోయిన అనిల్, గౌడిచర్ల లింగయ్య, దంతాల రామస్వామి, రైతులు మల్లయ్య, వెంకన్న, బిక్షం, అశోక్, శ్రీను పాల్గొన్నారు.



# దరఖాస్తుదారుల జాబితాల పై విచారణ చేపట్టిన మండల అధికారులు



నూతనకల్, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ వంటి పథకాలపై దరఖాస్తు చేసుకొని అందించిన జాబితాలపై అధికారులు గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి బాలు మాట్లాడుతూ పథకాలు పొందడానికి అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులపై ప్రత్యేకముగా ఏర్పాటు చేసిన టీముల సహాయముతో విచారణ చేపట్టి తయారు చేసిన జాబితాను ఈ నెల 21నుండి 24వరకు జరిగే గ్రామ సభలలో ప్రదర్శించి తదుపరి ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, తహసిల్దార్ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి మురళి బాబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి


## జాతర ప్రాముఖ్యతను కాపాడేందుకు కృషి చేయాలి

### రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



చివ్వెంల, మేజర్‌న్యూస్ : అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని, జాతర ప్రాముఖ్యతను కాపాడేందుకు కృషి చేయాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డిసర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం దురాజుపల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి దేవాలయంలో నూతనంగా ఎన్నికైన పెద్దగట్టు (గొల్లగట్టు) దేవాలయ కమిటి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. 5 రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జాతర కోసం ఏర్పడ్డ కమిటి కాదు, పూర్తి స్థాయిలో పెద్దగట్టు అభివృద్ధి కోసం ఏర్పడ్డ కమిటి అన్నారు. ప్రతి పౌర్ణమికి భక్తులు ఉండేందుకు వసతికి ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని సూచించారు. పెద్దగట్టు దేవస్థానాన్ని అభివృద్ధి చేసిన ఘనత రాంరెడ్డి దామోదర్ రెడ్డికే దక్కుతుందన్నారు. సీసీ రోడ్లు, హాల్ నిర్మాణం ఆయన హయాంలోనే జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పెద్దగట్టుకు నిధులు మంజూరు చేసినా ఈ రోజు వరకు సున్నా బ్యాలెన్స్ ఉండటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శిలపథకాలకు పార్టీ రంగులను వేసిన ఘనత గత బిఆర్ఎస్ పార్టీకే దక్కిందని ఎద్దేవా చేశారు. అంతకు ముందు దేవాలయ కమిటి చైర్మన్‌గా పోలెబోయిన నర్సయ్య యాదవ్, వైస్ చైర్మన్‌గా పోలెబోయిన నరేష్ పిల్లై, కమిటి సభ్యులుగా కుర్ర సైదులు, వీరబోయిన సైదులు, సిరిపంగి సైదమ్మ, మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్న మల్లయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డివిజన్ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈఓ కుశలయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ లక్ష్మి మకట్‌లాల్, నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్‌అలీ, ధరావత్ వీరన్న నాయక్, చింతమల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూరు మీదుగా వరంగల్‌కు ఆర్టీసీ బస్సులు నడపాలి



మోత్కూర్, మేజర్‌న్యూస్ : నల్లగొండ జిల్లా కేంద్రం నుండి మోత్కూరు మీదుగా వరంగల్‌కు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో బస్సులు నడపాలని కోరుతూ నల్లగొండ రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) జాన్ రెడ్డికి బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు జంగ సోము యాదవ్ మాట్లాడుతూ మోత్కూరు నుండి వరంగల్ వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గత 5 ఏళ్ల క్రితం నల్లగొండ నుండి మోత్కూరు మీదుగా హన్మకొండకు ఒక ఎక్స్ ప్రెస్ బస్సును నడిపించారని గుర్తు చేశారు. కరోన మూలంగా ఆ బస్సు రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నిత్యం విద్య, వైద్య, వివిధ వర్గాలు వ్యాపారాలు, పనుల నిమిత్తం ప్రయాణికులు వరంగల్ కు వెళ్లాలంటే సరైన రవాణా మార్గాలు లేక రాయగిరి, జనగామ, తొర్రూరు నుండి వెళ్తున్నారని తద్వారా వ్యయ ప్రయాస, దూర భారంతో పాటు వివిధ బస్సులలో ప్రయాణించి అధిక చార్జీలు చెల్లించవల్సి వస్తుందని ఆర్.ఎం. ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొనట్లు తెలిపారు. తమ వినతిపై ఆర్.ఎం. సానుకూలంగా స్పందించి త్వరలో వరంగల్‌కు బస్సులను నడిపించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు.

# పీడిత ప్రజల కోసం నిలబడి కలబడిన వ్యక్తి లక్ష్మారెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్, మేజర్‌న్యూస్ః భూస్వామ్య వార సత్వాన్ని వదులుకుని బాల్యం నుండే పోరాట బాటపట్టి చివరిదాకా పీడత ప్రజల కోసం నిలబడి, కలబడిన వ్యక్తి కాకి లక్ష్మారెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం మండల పరిధిలోని అమర్‌నగర్ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కాకి లక్ష్మారెడ్డి ఆరవ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు లక్ష్మారెడ్డి స్మారక స్థూపానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్ష్మారెడ్డి నిర్బంధాలకు, జైలు జీవితాలకు భయపడకుండా నైజాం వ్యతిరేక పోరాటం నుండి విప్లవోద్యం వరకు నిబద్ధతగా నిలబడి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచడంలో కీలకపాత్ర పోషించారని వారు తెలిపారు. బొప్పారం గ్రామానికి సర్పంచ్‌గా ఉన్న కాలంలో కులవివక్ష తీవ్రంగా కొనసాగుతున్న సందర్భంలోనే దళితవాడల్ని ఊరిలోకి తీసుకవచ్చిన సామాజిక విప్లవకారుడని కొనియాడారు. రాజకీయ కార్యచరణ మాత్రమే కాకుండా మానవీయ ఆలోచనలతో కుటుంబ, వ్యక్తిగత వివాదాలను చాకచక్యంతో పరిష్కరించే వాడని వారు అన్నారు. సిద్ధాంతాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు ఆయన జీవితాచరణ నుండి స్ఫూర్తి పొందవచ్చన్నారు. ప్రతి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం అందిస్తున్న పురస్కారాన్ని ఈ సంవత్సరం 1993లో జరిగిన ఎన్‌కౌంటర్ మృతుడు దొబ్బల కాంతయ్య భార్య లతకు అందచేశారు. కాకి లక్ష్మారెడ్డి త్యాగాలను స్మరిస్తూ రచయిత యోచన రచించిగా అరుణోదయ విమలక్కగానం చేసిన రెండు గీతాలను విడుదల చేశారు. వర్ధంతి కార్యక్రమానికి విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకులు రాయపూడి చిన్ని అధ్యక్షత వహించగా సిపిఐ నాయకులు కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుల వేదిక నియోజకవర్గ కన్వీనర్ మేకల నాగేశ్వరరావు, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగరి, పిడిఎస్‌యూ పూర్వ నాయకులు పందిరి నాగిరెడ్డి, హరికిషన్ పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల సర్వేతో పేదలకు భరోసా కల్పించాలి



తుర్కపల్లి, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన నేపథ్యంలో నిరు పేద కుటుంబాలకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లతో భరోసా కల్పించి, సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో రైతు భరోసా, ల్యాండ్ పరిశీలన, రేషన్ కార్డుల సర్వేను, తిర్మలాపూర్ గ్రామంలో రేషన్ కార్డుల సర్వే, తుర్కపల్లి మండల కేంద్రంలో రేషన్ కార్డుల సర్వేను, ఇందిరమ్మ ఇండ్లపై సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జగదీష్ కుమార్, రెవిన్యూ శాఖ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఏఈవోలు పాల్గొన్నారు.

# తడి పొడి చెత్త బుట్టల పంపిణీ

## - డాక్టర్ ర్యాకల శ్రీనివాస్




భువనగిరి, మేజర్‌న్యూస్ : యాదాద్రి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పుర గ్రామంలో డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారి సొంత నిధులతో యాదాద్రి జిల్లా సీఈఓ ఎన్. శోభారాణి, టి.నాగిరెడ్డి (యాదాద్రి జిల్లా డిఆర్‌డిఓ) సిహెచ్.శ్రీనివాస్ (యాదాద్రి జిల్లా ఎంపీడీవో) చేతుల మీదుగా గ్రామ పరిశుభ్రత కోసం గ్రామ ప్రజలకు 700 తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ. ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ తమ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి ఎప్పుడు ఉంటుందని, గ్రామంలో ఆపద కలిగిన తనను సంప్రదించవచ్చునని, తన గ్రామాభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజ్ పూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ బొమ్మరపు సురేష్, ఉపసర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్, గ్రామ వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటి విజేతలకు బహుమతుల ప్రధానం

## ఎమ్మెల్యే మందుల సామెల్

తుంగతుర్తి, మేజర్‌న్యూస్ : తుంగతుర్తి మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు భౌహుమతుల ప్రధానకార్యక్రమానికి ఎమ్మెల్యే మందుల సామెల్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులను ప్రదానం చేయడం జరిగింది. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.



# సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలను సేకరణ



మునుగోడు, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 26 నుంచి ప్రవేశపెడుతున్న రైతు భరోసా పథకం అమలులో భాగంగా గురువారం మండలంలోని పులిపలుపుల రెవిన్యూ పరిధిలోని గంగోరిగూడెం, బీరెల్లి గూడెం గ్రామాలలో తహసీల్దార్ ఏం.నరేందర్ సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలను సేకరించారు. రైతు భరోసా సాగుకు యోగ్యం కానీ భూములు ఇల్లు లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూములను, రియల్ ఎస్టేట్, లేఅవుట్, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు గోదాములకు మైనింగ్‌కు విని యోగిస్తున్న భూములు, రాళ్లు గుట్టలతో నిండి సాగుకు యోగ్యము లేని భూములు, ప్రభుత్వము సేకరించిన అన్ని రకాల భూములు గుర్తించి సర్వే రైతుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులిపల్పుల వ్యవసాయ విస్తరణాధికారి ఎం.నరసింహ, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# గెలిచిన ప్రైజ్ మనీతో స్నేహితునికి కుటుంబానికి ఆర్థిక సహాయం



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని వెల్మకన్నె గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వెల్మకన్నె ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో బచన్నగూడెం కింగ్స్ టీం మొదటి బహుమతిని సాధించింది. పోటీలో వచ్చిన ప్రైజ్ మనితో గ్రామంలో ఇటీవల మరణించిన ఆకారపు లక్ష్మణ్ కుటుంబానికి నిత్యవసర సరుకులను అందించారు. వచ్చిన బహుమతితో సరుకులను అందించి మానవత్వం చాటుకున్న బచ్చనగూడెం కెప్టెన్ లోగి గౌడ్, టీం సభ్యులకు ఆకారపు లక్ష్మణ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కడపగండి తండా గ్రామ కూడలిలో బెంచిల ఏర్పాటు

సంస్థాన్‌నారాయణపురం, మేజర్‌న్యూస్ : నారాయణపురం మండల పరిధిలోని కడపగండి తండాకు చెందిన రాజగోపాల్ రెడ్డి వీర అభిమాని కరంతోతు మోహన్ నాయక్ కడపగండి తండా గ్రామంలోని వృద్ధులు, యువకులు ఆహ్లాదకర వాతావరణంలో సాయంకాలం అందరూ కలిసి ఒకే చోట ముచ్చటించేందుకు 50వేల రూపాలయలతో గ్రామ కూడలిలో బెంచిలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బిచ్చ నాయక్, ఉపాధ్యక్షులు భాస్కర్ నాయక్, ఐఎన్టీయూసీ అధ్యక్షులు దంజ్యా నాయక్, అధ్యక్షులు సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షులు మోత్య నాయక్, రాజు, భాస్కర్, శ్రీను, చరణ్, తదితరులు పాల్గొన్నారు.



# సాగుకు యోగ్యం కానీ భూముల సర్వే

## - సర్వేను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు



హుజూర్‌నగర్‌రూరల్,మేజర్‌న్యూస్: రైతుభరోసా పథకంలో సాగుకు యోగ్యం కానీ భూములను గుర్తించుటలో భాగంగా గురువారం మండల పరిధిలోని అమరవరం గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహించారు. సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా శాఖల అధికారులను సర్వే గురించి అడిగి తెలుసుకుని సాగుకు యోగ్యం కానీ భూములను పకడ్బందీగా గుర్తించి వివరాలను నమోదు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఏడీఏ రవి, మండల వ్యవసాయ అధికారిణి స్వర్ణ, ఆర్ఐ సూర్యనారాయణ, ఏఈవో ప్రవీణ్ పాల్గొన్నారు.

# స్వర్ణగిరిలో శ్రీవారి కళ్యాణ మహోత్సవం



భువనగిరి, మేజర్‌న్యూస్ : సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించడం జరిగింది. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళ భరిత పుష్పమాలలతో అలంకరించి అనంతనామధేయుడైన శ్రీ స్వామివారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రతి గురువారం తిరుప్పావడ సేవ జరుగుతుంది. సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం కోసం శ్రీ స్వామి వారికి 450 కిలోల అన్నప్రసా దాన్ని, పులిహోర, లడ్డు, వడ తదితర పిండి వంటలను నివేదన చేసి అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో అర్పించి కర్పూరమంగళ హారతులు సమర్పిం చారు. ఉదయం 10:30లకు ఆదిమ ధ్యాంతరహితుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మనిమయ శోభిత వజ్రాభరణాలతో, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవో త్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీవారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకిస్తూ దివ్యానుభూతిని పొందారు. హైదరాబాద్ ఇస్కాన్ టెంపుల్ బంజారాహిల్స్ శ్రీ సత్య గౌర చంద్రదాస నిర్వాహకుల బృందం స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని హరే రామ హరే కృష్ణ కీర్తనలను ఆలపించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30కు ఆదిమధ్యాంత రహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీ ధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్పించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు శ్రీవారిని నయనానందకరంగా దర్శించుకున్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలి

## పాలడుగు ప్రభావతి



నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా మరియు మాజీ సర్పంచ్ సురిగి మణెమ్మ ఆధ్వర్యంలో ఈ రోజు నల్గొండ మండలంలోని చందనపల్లి గ్రామంలో ముగ్గుల పోటీ నిర్వహించటం జరిగింది. అనంతరం జరిగిన గ్రామసభకు మాజీ సర్పంచ్ సురిగి మనమ్మ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధి గా పాలడుగు ప్రభావతి ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ మహిళలు కాలినడక నుండి ఇప్పుడు విమానం నడిపే వరకు మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని . మహిళలు ప్రస్తుతం ఎక్కడ రాజీ పడకుండా మన లక్ష్యం వైపు సాగుతూనే ఉండాలని బతుకు బాటను వేసుకొని రంగవల్లి నైపుణ్యమే కాకుండా రాజకీయ చైతన్యం పెంచుకోవాలని అన్నారు. నేటి ఆధునిక సమాజానికి అంది వచ్చిన అద్భుత సాంకేతిక సాధనం సోషల్ మీడియా యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్బుక్, ఇంస్టాగ్రామ్, వాట్సప్ ఇలా ఒకటి రెండు కాదు లెక్కకు మించిన ప్లాట్ఫామ్స్ అందుబాటులోకి వచ్చాయని అన్నారు ఫలితంగా ఇంటి విషయాల నుండి ప్రపంచ రాజకీయాల వరకు అన్ని క్షణాల్లోనే మనకు అందుబాటులో ఉంటున్నాయని అయితే సోషల్ మీడియాలోని మంచినే ఎంచుకుంటే అదో అవకాశం హింస ద్వారా కానీ చెడును ఎంచుకుంటే మాత్రం అది విషవలయం ఇప్పుడు ఆ మంచి చెడుల విచక్షణ లోపించడమే ఆందోళనకరంగా మారిందని అన్నారు. ఇతరుల జీవితాలపై విచక్షణాలేని విశ్లేషణలు అర్థంపర్థం లేని వ్యాఖ్యానాలు చేసే ప్రబుద్ధులు కొందరైతే ఎవరికి వారు తమ ఆనందాన్ని పంచుకున్న దీనికి విపరీత అర్థాలు తీసి అసభ్యకరమైన కామెంట్లు చేసే నీచులు మరికొందరు ఇది ప్రస్తుతం ఓ ధోరణిగా ప్రబలిపోవడం మనుషుల్లో ఒక విపరీతంగా మారిన సోషల్ మీడియా వేదికగా మారిపోవడం మన కళ్ళ ముందరి విషాదంఅన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ చందనపల్లి గ్రామానికి చెత్త డంపింగ్ యార్డ్ శాపంగా మారిందని దోమలతో ఈగలతో కుక్కలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు మనుషుల కంటే కుక్కలు ఎక్కువైనాయని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలని ఇండ్లు ఇవ్వాలని ఇంటి స్థలాలు కొనుగోలు చేసి ఇవ్వాలని తెలియజేశారు. జగిని టెక్స్టైల్స్ ద్వారా మొదటి ద్వితీయ తృతీయ బహుమతులు అందించడం జరిగింది. మొదటి బహుమతి ఝాన్సీ ద్వితీయ బహుమతి జ్యోత్స్న తృతీయ బహుమతి ప్రసన్న గెలుచుకోవడం జరిగింది. మొత్తం 150 మంది ముగ్గుల పోటీలలో పాల్గొనగా ప్రతి ఒక్కరికి ప్రైస్ ఇవ్వడం జరిగింది. అనంతరం సభలో 500 మంది మహిళలు యువకులు పాల్గొన్నారు. యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించగా సురిగి రమేష్ ద్వారా మొదటి బహుమతి 5000 ద్వితీయ బహుమతి 2000 అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకుడు సూరిగే రమేష్ మాజీ ఎంపీటీసీ రూపని వెంకటమ్మ వార్డ్ నెంబర్లు కొరదాల లింగయ్య పాలడుగు శంకర్ తంతేనపల్లి సైదమ్మ కాశీ మల్ల విజయ్ కోడదల మని, సాయి గాదరి గంగుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు యువకుడు మృతి



హుజూర్‌నగర్‌రూరల్, మేజర్‌న్యూస్ : రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పట్టణ పరిధిలోని పిఎస్‌టీ కార్యాలయంలో సమీపంలో చోటు చేసుకుంది. గురువారం ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన కంటు అరవింద్ (28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన రాత్రి సమయంలో అరవింద్ మాధవరాయనిగూడెంలో జరగుతున్న కబడ్డీ పోటీలను తిలకించేందుకు ఏపి 24 టీసీ 1781 నెంబర్‌గల ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో పిఎస్‌టి కార్యాలయం వద్దకు రాగానే ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను తప్పించబోయి ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొనడంతో తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడని, మృతుడి తండ్రి కంటు హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలు

## – యువతికి స్వల్ప గాయాలు





గరిడేపల్లి, మేజర్‌న్యూస్ ః మండల కేంద్రంలోని అబ్బిరెడ్డిగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో ఆకస్మాత్తుగా బ్రేక్ వేసిన టాటా ఏసికి స్కూటీ ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలు కాగా మరో యువతికి స్వల్ప గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం మండలం తలంపాడు గ్రామానికి చెందిన డేరంగుల సురేష్ తన చెల్లి యమునతో కలసి స్కూటీపై మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామానికి సంక్రాంతి పండుగకు బంధవుల ఇంటికి వెళ్లి అక్కడ నుండి గురువారం దిర్శించర్ల గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం బంధువుల ఇంటి నుండి ఖమ్మం బయలుదేరుతుండగా మండల కేంద్రంలోని మిర్యాలగూడ – కోదాడ ప్రధాన రహదారిపై ఎలాంటి సిగ్నల్ లేకుండా ఆకస్మాత్తుగా టాటా ఏసీ వాహనం డ్రైవర్ బ్రేక్ వేడయంతో వెనుక నుండి స్కూటీ తగలడంతో ప్రమాదం జరిగింది. సురేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. సోదరి యమునకు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయాలైన వారిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుల బంధువు వేముల శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు.

# లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

## జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి




బీబీనగర్,మేజర్,న్యూస్ః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26వ తేదీ నుండి అమలు చేయనున్న రైతు భరోసా,కొత్త రేషన్ కార్డు పథకాలకు లబ్దిదారుల ఎంపిక ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అన్నారు.గురువారం మండలకేంద్రంలోని ఎంపీఓ కార్యాలయంలో వెరిఫకేషన్ టీంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా,రేషన్ కార్డుల సర్వే తీరును పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.సర్వే ప్రక్రియలో అధికారులు పారదర్శకంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని,ప్రభుత్వ నిబంధన తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు.రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు దారిద్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేదలను గుర్తించాలని,భూములు ఆదాయం వంటి వివరాలు తప్పులు లేకుండా ఫారంలో నమోదు చేయాలని ఆదేశించారు.రైతు భరోసా కింద వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం భూభారతి(ధరణి)పోర్టర్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా వర్తిసుందన్నారు. గ్రామపంచాయతీ,మున్సిపాలిటీ రెవెన్యూ రికార్డులో క్రోడీకరించిన వాటితో పాటు గ్రామల మ్యాప్‌లను పరిశీలించాలన్నారు.యోగ్యం కాని భూముల జాబితాను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా పర్యవే క్షణ జరిపి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలోఎంపీఓ శ్రీనివాస్ రెడ్డి,తహసీల్దార్ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి పద్మ,మండల ప్రత్యేక అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా పోటీలతో క్రీడాకారుల్లో మానసికోల్లాసం



చింతలపాలెం, మేజర్‌న్యూస్ ః క్రీడా పోటీలతో క్రీడాకారుల్లో మానసికోల్లాసం కల్గుతుందని ఎస్ఐ అంతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరాల కొండారెడ్డిలు అన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా గురువారం మండల పరిధిలోని వజినేపల్లి గ్రామంలో విసిఎల్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం జరిగింది. కాగా క్రికెట్ పోటీలలో విన్నర్ టీంగా సన్‌రైజర్ దొండపాడు టీం మొదటి బహుమతి,రన్నర్ టీం వజినేపల్లి వారియర్స్ ద్వితీయ బహుమతిని గెలుపొందడం జరిగింది. విజేత లకు బహుమతులను వారు అందచేశారు. మొదటి బహుమతి ఏఎస్ఆర్ వృక్షం చైర్మన్ ఆవుల సైదేశ్వరరావు,ద్వితీయ బహుమతిని డెక్కం తిరుపతిరావులు ప్రైజ్‌మని అందచేశారు. కార్యక్రమంలో విసిఎల్ కమిటీ సభ్యులు వేముల శ్రీకాంత్, అమరవరపు జోజిబాబు,యండ్రతి సారథి,సురేష్,మంగళపల్లి నాగరాజు, సురేందర్, గ్రామ పెద్దలు రామిశెట్టి కాళేశ్వరరావు,గుజ్జుల రామిరెడ్డి, వేముల విష్ణు, రాములు, రామిశెట్టి హరీష్,అమరవరపు కొండలు,మంగళపల్లి లాజర్,యండ్రతి యేసురత్నం పాల్గొన్నారు.

# జానికమ్మ మృతి సిపిఐకి తీరనిలోటు

## – సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్



గరిడేపల్లి, మేజర్‌న్యూస్ ః ప్రముఖ కమ్యూనిస్టు నాయకురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు కామ్రేడ్ వేసాల జానికమ్మ మృతి సిపిఐకి తీరిన లోటని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన కామ్రేడ్ వేషాల జానికమ్మ గురువారం మృతి చెందడం జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఆమె మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై ఎర్ర జెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో తన భర్త వేషాల రామస్వామికి ఉద్యమంలో అన్ని విధాలుగా తోడ్పాటు అందించిందని ఆయన అన్నారు. ఉద్యమకారులకు భోజన వసతి సౌకర్యం కల్పించి వారికి అండగా నిలబడిన వ్యక్తి అని ఆమె యొక్క గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోకల వె ంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కనకయ్య, సిపిఐ మండల కార్యవర్గసభ్యులు కుందూరు వెంకటరెడ్డి, ఆంజనేయులు, సత్యనారాయణ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు సైదులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

# నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ ః లయన్స్‌క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల వారి ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన పట్టణంలోని బెనర్జీ హాస్పటల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గురువారం క్లబ్ అధ్యక్షులు జిలకర్ర రామస్వామి, జోన్ ఛైర్‌పర్సన్ చల్లా ప్రభాకరెడ్డిలు తెలిపారు. గురువారం ఉచిత కంటి వైద్య ప్రచార కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం కోరారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కోశాధికారి షేక్ యూసూఫ్, క్లబ్ సభ్యులు నాగండ్ల శ్రీధర్, చిత్రం విశ్వనాథం, మూలగుండ్ల వెంకటరెడ్డి, బాదావత్ సైదా పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన ర్యాంపులు



నేరేడుచర్ల,మేజర్‌న్యూస్‌ః మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామపంచాయతీ పరిధిలో ఊర చెరువు అలుగు వద్ద నిర్మించిన రెండు ర్యాంపులు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. పెంచికల్‌దిన్నె నుండి సోమారం వెళ్లే ప్రధాన రహ దారిలో చెరువు అలుగు వద్ద నిర్మించిన రెండు ర్యాంపులు రెండు చోట్ల కుంగిపోయి గుంటలు ఏర్పడ్డాయి.ఇటీవల సోమారం రోడ్డు నిర్మాణ పనులకు అధిక బరువు గల కంకర లారీలు వెళ్లడంతో రెండు చోట్ల పూర్తిగా ర్యాంపులు కుంగిపోయి ప్రమాదానికి నిలయంగా మారాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి మరమ్మత్తులు చేపట్టాలని, లేనియెడల నూతనంగా నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకంగా ఉండాలి

### - క్షేత్ర స్థాయి పర్యటనలో సాగుచేయని భూములను జాగ్రత్తగా గుర్తించాలి

### - సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు



హుజూర్‌నగర్‌రూరల్‌,మేజర్‌న్యూస్‌ః ఈ నెల 26 నుండి చేపట్టబోయే ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకంగా ఉండాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. గురువారం పట్టణంలోని మండల తహసీల్ధార్ కార్యాలయంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,నూతన రేషన్‌కార్డుల మంజూరు పథకాలపై ఆర్డీవో శ్రీనివాసులతో కలసి అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డులు,లబ్ధిదారుల గుర్తింపుని క్షేత్రస్థాయి పర్యటనలో పట్టణంలో మున్సిపల్ కమిషనర్, రూరల్‌లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపిక చేయాలని సూచించారు.అంతక ముందు మండలంలోని అమరవరం గ్రామంలో జరుగుతున్న సేద్యం చేయని భూముల సర్వేని అదనపు కలెక్టర్ పరిశీలించారు.సాగు చేయని భూముల విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా సర్వే చేపట్టాలని ఏమైనా అనుమానాలు ఉంటే ఉన్నతాధికారుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు.సాగు చేయని భూములను గుర్తించి అట్టి పట్టాదారులను రైతు భరోసా పథకంకు అనర్హులుగా గుర్తించాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్,తహసీల్ధార్ నాగార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి,ఎంపిడివో కార్యాలయ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి,ఏవో స్వర్ణ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట టౌన్, మేజర్‌న్యూస్ ః పట్టణంలోని 1 టౌన్ పరిధిలోని హనుమాన్ నగర్, ఎస్‌ఎల్‌ఎస్ స్కూల్ వెనుక విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు 1 టౌన్ విద్యుత్ ఏఈ ఆర్ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల మరమత్తుల దృష్ట్యా ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

### ట్రాఫిక్ ఎస్సై సాయిరాం




సూర్యాపేట, మేజర్‌న్యూస్ ః మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం అన్నారు. స్థానిక ఈనాడు ఆఫీసు వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడుపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ అనేక చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే భారీ జరిమానా తప్పదని, మద్యం సేవించిన కేసులు పునరావృతం అయితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడి కృష్ణ మృతదేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ ః మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మామిడి వెంకన్న గౌడ్ తండ్రి చీదెళ్ళ పిఏసిఎస్ డైరెక్టర్ మామిడి కృష్ణగౌడ్ మృతదేహానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి కృష్ణ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. పార్టీ కార్యక్రమాలలో చాలా చురుగ్గా పాల్గొనే వారని గుర్తు చేశారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన వారిలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ తూముల భుజంగరావు, పెన్‌పహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు, పెన్‌పహాడ్ మాజీ జడ్‌పిటిసి పిన్నెని కోటేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ బండి ధనమ్మ రామకృష్ణారెడ్డి, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## టిబి వ్యాధి లక్షణాలపై అవగాహన

పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ ః మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో గురువారం టిబి వ్యాధి లక్షణాలపై అవగాహన సదస్సును, క్షయ నివారణ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ 60 సంవత్సరాలపై బడిన మధుమేహం, టిబి లక్షణాలు ఉన్నవారికి, గత ఐదు సంవత్సరాల క్రితం ఉన్న టిబి పేషంట్స్‌ని, గత రెండు సంవత్సరాలుగా ఉన్న టిబి పేషంట్లకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. మద్యపానం, దూమపానం సేవించరాదన్నారు. 18.5 బిఎంఐ పోషకాహార లోపంతో బరువు తక్కువగా ఉన్న 40 మందిని గుర్తించి వారి నుండి కల్లె నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. పరీక్షలో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలు ఉచితంగా మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇవ్వడం జరుగుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఈఓ భూతరాజు శ్రీనివాసులు, ఎంపిహెచ్ ఈఓ టి చంద్రశేఖర్ రాజు, పిహెచ్ ఎన్ శశిరేఖ, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ పూజ, రాజు, సుభద్ర, లక్ష్మి, కవిత, సుజాత, రజిత, జ్యోతి, పార్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాగుచేసే భూములకే రైతుబరోసా

### తహశీల్దార్ లాలూనాయక్

పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ ః మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సాగుచేయని భూములను క్షేత్రస్థాయి పర్యటనలలో గుర్తించి వారిని రైతుబరోసా పథకానికి అనర్హులుగా తొలగించడానికి ప్రభుత్వ అధికారులు గురువారం నుండి సర్వే నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగే సర్వే ప్రారంభమైన సందర్భంగా తహశీల్దారం ధరావత్ లాలునాయక్ మాట్లాడుతూ అధికారులు సమన్వయం చేసుకుంటూ జనవరి 16 నుండి 20 వరకు గ్రామాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ సర్వే నంబర్ ప్రకారం సాగుచేయని భూములను గుర్తించాలన్నారు. సాగు చేయని భూములలో రాళ్లు, గుట్టలను సర్వేయర్ ద్వారా వివరాలు సేకరించాలని, పల్లెల్లో లేఅవుట్‌లు, నాలాగా మార్చిన భూములను, ఇండస్ట్రీలకి సంబంధించిన వివరాలను సర్వే ద్వారా సేకరిస్తున్నామని సాగుచేయని భూముల వివరాలను జనవరి 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో తెలయపర్చి వారిని రైతు బరోసా పథకంకు అనర్హులుగా గుర్తించాలని సూచించారు. తదుపరి సాగుచేసే ప్రతి ఎకరానికి సంవత్సరానికి 12వేల రూపాయలను రైతుబరోసా పథకం క్రింద ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్, ఇంచార్జి సర్వేయర్ ప్రసాద్, ఆర్ఐ రంజిత్‌రెడ్డి, ఏఈఓ శ్రావణి, జూనియర్ అసిస్టెంట్ ఆజీర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేను పగడ్బందీగా నిర్వహించాలి

సంస్థాన్ నారాయణపురం మేజర్ న్యూస్ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రేషన్ కార్డు, ఆత్మీయ భరోసాల సర్వేను పగడ్మందీగా నిర్వహించాలని భువనగిరి భూ సేకరణ విభాగం అడిషనల్ కలెక్టర్ మండల స్పెషల్ అధికారి బి.జయశ్రీ అధికారులను ఆదేశించారు. గురువారం సంస్థాన్ నారాయణపురం మండల పరిషత్ కార్యాలయంకు ఆమె స్పెషల్ ఆఫీసర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో, ఎంపీవోలతో సమావేశం ఏర్పాటు చేసి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తప్పులు లేకుండా సర్వేను పూర్తి చేయాలని అన్నారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి దరఖాస్తుదారుల సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపీడీవొ ప్రమోద్ కుమార్, ఎంపీఒ నర్సింహ్మారావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ప్రశాంతి, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ సిద్ధార్థ పాల్గొన్నారు.

## వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి స్వచ్ఛంధ సేవా కార్యక్రమాలు

గరిడేపల్లి, మేజర్‌న్యూస్ ః మండలంలోని సర్వారం గ్రామ యూత్ ప్రజల సహకారంతో గ్రామంలోని శ్రీమంతులు సర్వారం వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి గ్రామంలో సామాజిక అభివృద్ధి, ప్రజా సమస్యలపై పలు స్వచ్ఛంధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కాగా గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన కొల్లి రాములమ్మ ఇటీవల చనిపోగా ఆ కుటుంబానికి శ్రీమంతులు సర్వారం వాట్సప్ గ్రూప్ తరుపున రూ.15వేల విలువగల నిత్యవసర సరుకులను మృతురాలి కుటుంబ సభ్యులకు అందచేశారు.ప్రతి పేద కుటుంబానికి తోచిన ఆర్థిక సహాయం గ్రూప్ తరపున చేపట్టడంతో పాటు మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని గ్రూప్ సభ్యులు తెలిపారు.

## సాగుచేయని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

చివ్వెంల, మేజర్‌న్యూస్ ః పంటలు సాగు చేయని భూములను గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో గుర్తించాలని మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్ రెడ్డి, ఆర్డీఓ వేణుమాధవ్‌లు అన్నారు. గురువారం మండలంలోని చివ్వెంల, అయిలాపురం గ్రామాలలో అధికారులతో కలిసి సాగుచేయని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాగు చేయని భూములలో రాళ్లు, గుట్టలను సర్వేయర్ ద్వారా వివరాలు సేకరించాలని, పట్టణంలోని లేఅవుట్‌లు, నాలాలుగా మార్చిన భూములను, ఇండస్ట్రీలకి సంబంధించిన వివరాలను మున్సిపల్ కమీషనర్ ద్వారా తీసుకొని సాగుచేయని భూముల జాబితాలోకి చేర్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, శైలజ, వెంకటరెడ్డి, సహస్, ఆర్ఐలు శ్రీనివాస్, శ్రావణి, సర్వేయర్ శ్యామ్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# చండూరులో అమైర ఆయుర్వేద పంచకర్మ సెంటర్ ప్రారంభం



చండూరు, మేజర్‌న్యూస్ : మున్సిపాలిటీ పరిధిలో గురువారం అమైర ఆయుర్వేద పంచకర్మ సెంటర్‌ను ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న చండూరు పట్టణంలో ఆయుర్వేద పంచకర్మ సెంటర్ ఏర్పాటు కావటం సంతోష దాయకమని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. క్లినిక్ నిర్వకులు డా॥ మద్దెల లఖన్, ఆశ కిరణ్‌లు మాట్లాడుతూ ప్రజలకు ఆయుర్వేద చికిత్స పై నమ్మకం కలింగించాలనే ఉద్దేశ్యంతో ఈ క్లినిక్ ప్రారంభించటం జరిగిందని అన్నారు. ఈ క్లినిక్ నందు వెన్ను నొప్పి, మెడ నొప్పి, చర్మవ్యాధులు, మధుమేహ వ్యాధులకు చికిత్స, పంచకర్మ ప్రక్రియ ద్వారా చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పన్నాల లింగయ్య, కర్నాటి లక్ష్మయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్య దినపత్రిక క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన గుర్రంపోడ్ ఎస్ఐ పసుపులేటి మధు





గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సూర్య నేటి దినపత్రిక క్యాలెండర్, డైరీ ఎస్ఐ మధు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ నాగరాజు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధు మాట్లాడుతూ సూర్య పత్రిక విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తుందని అన్నారు. సమాజంలో పత్రికల పాత్ర కీలకమైనదని, వీటికి స్వేచ్ఛ ముఖ్యమన్నారు. పత్రికలో పనిచేసే జర్నలిస్టులకు పత్రికలకు కూడా స్వేచ్ఛ ఉండాలన్నారు. ఎవరికి భయపడకుండా నిర్భయంగా నిస్సంకోచంగా వార్తలు రాసి నిజ నిజాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం పాతికేయులపై ఉందన్నారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరవేయడంలో పత్రికల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చామలేడు గ్రామం ఐబిసి నెట్వర్క్ ఆపరేటర్ ఏడుకొండలు, మండల సూర్యనేటి దిన పత్రిక రిపోర్టర్ పాలడుగు శ్రీధర్ పాల్గొన్నారు.

**చౌటుప్పల్ :** చౌటుప్పల మున్సిపల్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజుకి ఆ పత్రిక చౌటుప్పల్ రిపోర్టర్ చినుకని యువరాజు క్యాలెండర్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ, బొబ్బిళ్ళ మురళి, చెరుకు లింగస్వామి, ప్రజాపతి విష్ణు తదితరులు పాల్గొన్నారు.



# భవన నిర్మాణ కార్మికులు క్యాలెండర్ ఆవిష్కరణ

## గుమ్మల మోహన్ రెడ్డి



నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : పేద వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. బుధవారం నల్గొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్‌తో కలిసి నల్లగొండ పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఐఎన్‌టియుసి-2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంఘానికి, కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా మాజీ కార్యదర్శి, ముఖ్య సలహాదారు ఎండి మహమూద్, పట్టణ అధ్యక్షుడు సోలిపురం శంభు రెడ్డి, ఉపాధ్యక్షుడు పోతపాక సహదేవ, కోశాధికారి ఎస్.కె.గౌస్, ప్రధాన కార్యదర్శి బొజ్జ నాగరాజు, కార్యదర్శి పెరిక నరసింహా, సహాయ కార్యదర్శి కొమ్మనబోయిన మల్లయ్యతో పాటు సలహాదారులు, సభ్యులు డి.యాదయ్య, గాదపాక వీరయ్య, జీడిమడ్ల యాదయ్య, కొండా రాములు, సిహెచ్ మహేష్, ఆర్.కిరణ్ కుమార్, వజ్జ నరసింహ, పోతేపాక యాదయ్య, బోడ సోములు తదితరులు పాల్గొన్నారు.

# పాలడుగు వాసి శివశంకర్‌కు డాక్టరేట్



మోత్కూర్, మేజర్‌న్యూస్ : మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన బొడిగె శివశంకర్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి డాక్టరేట్ డిగ్రీని పొందారు. విశ్వవిద్యాలయంలోని చరిత్ర విభాగం నుండి ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ పర్యవేక్షణలో ట్రైబల్ రిలీజియన్ ఇన్ ఇండియా, ఎ స్టడీ ఆఫ్ గోండ్స్ అండ్ కొండారెడ్డీస్ ఇన్ తెలంగాణ (1936-2020 ఏ.డి) అన్న అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసం సమర్పించినందుకు తనకు డాక్టరేట్ లభించిందని తెలిపారు. పరిశోధనలో భాగంగా తనకు సహకారాన్ని అందించిన పర్యవేక్షకులు ప్రొఫెసర్ సత్యనారాయణ, తల్లిదండ్రులు బొడిగె యాదయ్య, ఎల్లమ్మ, సోదరులు రవి,రఘు, చెల్లి, బావ చంద్రకళ,లింగస్వామి, కోడలు హస్వికా గౌడ్‌కు శంకర్ ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ ప్రాంతమైన పాలడుగు ప్రాంతం నుంచి డాక్టరేట్ పొందిన శంకర్‌కు పరిశోధకులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

# 50 కోట్ల నష్టాలు ఉన్న సమయంలో చైర్మన్‌గా భాద్యతలు స్వీకరించా

## రోజుకు 40 వేల లీటర్ల పాల విక్రయాలను 1.20 లక్షల లీటర్ల వరకు పెంచాం

యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : రోజుకు 95 వేల లీటర్ల పాలను మార్కెటింగ్ చేసి విక్రయాలు జరిపాం. లీటర్ పాలకు రూ.5 పెంచాం. గత నాలుగు నెలల క్రితం మధర్ డెయిరీ ఎన్నికల వచ్చాయి. మంత్రులు ఎమ్మెల్యేలు వచ్చి హామీలు కురిపించారు. నలుగురి అభ్యర్థులను నిలిపారు. మొత్తం 300 పాల సంఘం చైర్మన్లు పెట్టి ఆంధ్రలో బ్రేక్ డ్యాన్స్‌లు చేయించారు. మమ్ముల్ని గెలిపిస్తే రూ. 4, రూపాయల బోనస్, రూ. 30 కొట్ల గ్రాంట్ తీసుకువస్తాం. గతంలో ఉన్న 3 బిల్లులు పెండింగ్ లను తీసుకొస్తామని హామీ, నెల మొదటి తేదీన బిల్లులు ఇస్తామని హామీ ఇచ్చారు. పాడి రెట్కతులు నమ్మి ఓట్లేసి గెలిపించారు.95 లీటర్ల సెల్స్ ఉంటే ప్రస్తుతం 45 వేల లీట్లర కు పడిపోయింది.హాస్టల్ లో పాల సరఫరా తగ్గించారు.దీనావస్థలోకి మధర్ డెయిరీని నెట్టి వేశారు. ప్రస్తుతం లీటర్ కు 13 రూపాలు నష్టంలో ఉంది.గత పాలనలో సేల్స్ పెరిగాయి, ఉద్యోగులు మంచిగా జరిగాయి.చిట్యాలలో 32 ఎకరాలు, మిర్యాల గూడలో 1. 20 ఎకరాలు మధర్ డెయిరీ ఆస్తులను ఆమ్మేందుకు సిద్ధం అవుతున్నాడు. భూములను అమ్మేందుకు



వీలు లేదు. స్థిరాస్తులు అమ్మితే సహించం. రూ. 50 కోట్లలో సంస్థ నష్టాలలో ఉంటే అమ్మడానికి వీలు ఉండదు. భూ దందా చేసేందుకు స్థిరాస్తి విక్రయ గందరగోళం నెలకొల్పారు. వాటాలను పంచుకునేందుకు అమ్మకాలు పెట్టారు.95 వేల సేల్స్ నుంచి 46 వేల సేల్స్ ఎందుకు పడిపోయింది. మధర్ డెయిరీతో అలేరు నియోజకవర్గ ప్రాంతానికి మేలు జరుగుతుంది. విజయ డెయిరీకి 100 కోట్లు గ్రాంట్ ఇచ్చారని, మధర్ డెయిరీ ఎందుకు ఇవ్వడంలేదు. మంత్రులు ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారో. గుట్టకు మధర్ డెయిరీ నెయ్యి రద్దు చేసి విజయ డెయిరీ సరఫరా చేసే ఒప్పందం కుదుర్చుకుంటే ఏం చేస్తున్నారో చెప్పాలి.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రాంట్స్, 4 రూపాయల బోనస్, వెంటనే నెరవేర్చాలి. పాడి రైతులను రోడ్డు మీద పడేసే యోచనలో ప్రస్తుత చైర్మన్ చేస్తున్నారు. ఇది చర్య చాలా బాధాకరం. వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ నార్మూల్ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో గడ్డమీది రవీందర్ గౌడ్, కొండల్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మాజీ డైరక్టర్లు వెంకటరామిరెడ్డి, దొంతిరి సోమి రెడ్డి, డైరక్టర్ కందాల అలివేలు రంగారెడ్డి, పాల సంఘం చైర్మన్లు మారెడ్డి కొండల్ రెడ్డీ, గడ్డం భరత్ గౌడ్, సందిళ్ళ భాస్కర్ గౌడ్, ఒగ్గు భిక్షపతి, మాజీ ఎంపీటీసీ బీర్ల మహేష్, పాండవుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.